సాక్షి విశాఖపట్నం

గురువారం । 14 । ఆగస్టు । 2025



మాదకద్రవ్య రహిత విశాఖే లక్ష్యం 8లో



రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించండి 8లో



భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం 8లో

న్యూస్‌రీల్

స్టీల్ మెల్ట్ షాప్-2లో 72 హీట్లతో కొత్త రికార్డు



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ మరో అద్భుతమైన ఘనతను సాధించింది. స్టీల్ మెల్ట్ షాప్-2 (ఎస్ఎంఎస్-2) విభాగంలో మంగళవారం అత్యధికంగా 72 హీట్లను ఉత్పత్తి చేసి సరికొత్త రికార్డును నెలకొల్పింది. గతంలో 2021 జనవరి 30న సాధించిన 68 హీట్ల రికార్డును ఇది అధిగమించింది. ఈ రికార్డు సాధనలో భాగంగా మూడు షిఫ్టుల్లోనూ 24 చొప్పున మొత్తం 72 హీట్లు ఉత్పత్తి అయ్యాయి. దీంతో రెండు స్టీల్ మెల్ట్ షాపులలో కలిపి మొత్తం 133 హీట్లు ఉత్పత్తి అయ్యాయి. అంతేకాకుండా మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో కలిపి 19,037 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి కావడం విశేషం. ఈ రికార్డు సాధనలో కృషి చేసిన ఉద్యోగులను స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు అభినందించారు.

వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో క్లియరెన్స్ సెల్

దాబాగార్డెన్స్: వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు జీవీఎంసీలో సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నోడల్ అధికారులు ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష‌కుమార్ 9848308823, సిటీప్లానర్ వి.మీనాకుమారి 8374966777, కార్యనిర్వాహక ఇంజనీర్ డి.శ్రీధర్ 8187898427, అగ్నిమాపక అధికారి బి.కృపావరం 9912448555, అలాగే జోనల్ స్థాయిలో జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్లను సంప్రదించాలని తెలిపారు.

సిట్ నివేదికలో పేర్కొన్న భూములు హాంఫట్ అవుతున్నాయి. అపెక్స్ కమిటీ పేరుతో విలువైన భూములను సిట్ నివేదిక నుంచి తొలగిస్తూ కూటమి ప్రభుత్వం నాటకానికి తెరలేపింది. ఉమ్మడి విశాఖలో విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు, సంస్థల చేతికి కట్టబెడుతోంది. ఇప్పటికే ఎండాడలోని రూ.100 కోట్ల విలువ చేసే 5.10 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు సంస్థలకు అప్పగించిన ప్రభుత్వం.. తాజాగా పరవాడలో రూ.70 కోట్ల విలువైన 6.26 ఎకరాల భూమిని ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టింది. ఈ వ్యవహారాల్లో **తెరవెనుక చినబాబు** ఉండగా.. తెర ముందు **ఒక్కోసారి ఒక్కో పాత్ర**ధారి వచ్చిపోతున్నారు. **వీరి ద్వారా కథ నడిపిస్తూ** కోట్లు దండుకుంటున్న**ట్లు ఆరోపణలు వినిపి**స్తున్నాయి. మొన్నటి ఎ**ండాడ భూ వ్యవహారంలో** దక్షిణ నియోజకవర్గా**నికి చెందిన నేత పాత్రధారి** కాగా.. తాజాగా పరవా**డలో ఓ సు'కుమారు'డు** ఆ పాత్రను పోషించారు. **విచిత్రంగా** ఈ ఇద్దరూ ఒకే అపా**ర్ట్‌మెంటులో** నివసిస్తుండటం గమ**నార్హం.**



సిట్‌లో భూములు హాంఫట్!

సు'కుమారం'గా చక్రం తిప్పేశాడు

పరవాడలో 6.26 ఎకరాలపై నిషేధం ఎత్తివేత

- నేరుగా ప్రైవేటు సంస్థకు భూ బదలాయింపు
- భూమి విలువ రూ.70 కోట్లు
- సిట్‌లో లేవని.. అందుకే నిషేధం ఎత్తివేశామంటూ మెలిక



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై నిషేధాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం.. 'సిట్' నివేదికలోని భూములపై మాత్రం ఎడాపెడా నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రైవేటుపరం చేస్తోంది. ఇప్పటికే ఎండాడలో రూ.100 కోట్ల విలువైన 5.10 ఎకరాల భూమిపై నిషేధాన్ని ఎత్తివేసి ప్రైవేటు వ్యక్తుల పరం చేసిన కూటమి ప్రభుత్వం.. తాజాగా పరవాడలోని 6.26 ఎకరాలను సైతం ఓ ప్రైవేటు సంస్థ పరం చేసింది. ఈ భూమి విలువ రూ.70 కోట్లకు పైమాటే ఉంటుందని తెలుస్తోంది. ఇందుకోసం సిట్‌లో ఫలానా సర్వే నెంబర్లు లేవంటూ ఈ ఏడాది **ఫిబ్రవరిలో అపెక్స్ కమిటీ మెమోను చూపించడం గమనార్హం. ఇందుకు అనుగుణంగా అనకాపల్లి** జిల్లా కలెక్టరు 6.26 ఎకరాల భూమిపై నిషేధం ఎత్తివేస్తూ గత నెలలో ఆదేశాలు జారీ చేశారు. ఫలితంగా పరవాడలోని దేశపాత్రునిపాలెం పరిధిలోని 360-1, 360-2 సర్వే నెంబర్లలోని 6.26 ఎకరాల భూమి నేరుగా ప్రైవేటు సంస్థ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ వ్యవహారంలో బీచ్ రోడ్‌లో ఉండే సు'కుమారు'డు చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. దీంతోపాటు కొమ్మాది, మధురవాడ, పరవాడలోని మరికొన్ని సర్వే నెంబర్లకు చెందిన భూములపై నిషేధం ఎత్తివేయించేందుకు సదరు వ్యక్తి భారీ స్థాయిలో డీల్స్ కుదుర్చుకున్నట్టు సమాచారం.

ఇదీ నేపథ్యం..!



పరవాడ మండలం దేశపాత్రునిపాలెం పరిధిలోని 360-1, 360-2, 360-3, 360-2 సర్వే నెంబర్లలో మొత్తం 13.25 ఎకరాల భూమిని నలుగురు మాజీ సైనికోద్యోగులకు (రమణమ్మ, ఎస్.వేణుగోపాల్ రెడ్డి, ఏఎస్ఆర్‌కే కుమార్, ఆర్.రామచంద్రరావు) కేటాయించారంటూ రికార్డుల్లో ఉంది. ఈ భూములను వారి నుంచి గతంలోనే కోరమాండల్ ఎస్టేట్స్ అండ్ ప్రాపర్టీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కొనుగోలు చేసింది. అప్పట్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు భూ వివాదాలు నడుస్తున్నాయని.. భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ మంత్రి అయ్యన్న ఆరోపించారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసి విచారణ కూడా నిర్వహించారు. దీంతో గతంలో జరిగిన భూలావాదేవీలపై నిషేధం విధించారు. ప్రధానంగా మాజీ సైనికోద్యోగులకు చెందిన భూములపై లావాదేవీలు జరగకుండా నిషేధం కొనసాగింది. ఈ నేపథ్యంలో దేశపాత్రునిపాలెం పరిధిలోని 13.25 ఎకరాల భూముల లావాదేవీలపై కూడా నిషేధం ఉంది. ఇప్పుడు హఠాత్తుగా సిట్‌లో 360-1, 360-2 సర్వే నెంబర్లు లేవని అపెక్స్ కమిటీ మెమోను చూపిస్తూ ప్రైవేటు సంస్థకు 6.26 ఎకరాల భూమిని కట్టబెట్టడం గమనార్హం.

అపెక్స్ కమిటీ పేరుతో అక్రమాలు..!

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సిట్ నివేదికపై అపెక్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ అపెక్స్ కమిటీ తమకు అనుకూలమైన సర్వే నెంబర్లను సిట్ నివేదిక నుంచి తప్పించేందుకు ప్రయత్నించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా దేశపాత్రునిపాలెంలోని 360-1, 360-2 సర్వే నెంబర్లకు చెందిన 6.26 ఎకరాల భూమిని సిట్ నివేదికను తప్పించినట్టు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా 2025 ఫిబ్రవరి 14న అపెక్స్ కమిటీ అన్ని జిల్లాల కలెక్టర్లకు మెమో రూపంలో ఆదేశాలు జారీచేసింది. దీని ఆధారంగా అనకాపల్లి కలెక్టర్ పైరెండు సర్వే నెంబర్లలోని భూములపై నిషేధం ఎత్తివేస్తున్నట్టు ఉత్తర్వులు జారీచేశారు. అయితే సదరు మాజీ సైనికోద్యోగుల పేరు మీద కాకుండా.. నిబంధనలకు విరుద్ధంగా గతంలో విక్రయించిన ప్రైవేటు సంస్థ పేరు మీదనే ఉత్తర్వులు జారీచేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో సు'కుమార్' కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమాల 'కేడీ'..!

దేశపాత్రునిపాలెంలోని 6.26 ఎకరాల భూమిపై నిషేధం ఎత్తివేసేలా చేసిన వ్యవహారంలో బీచ్ రోడ్‌లో ఉండే సు'కుమార్' చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ కూడా ఆ భూమిని తిమ్మిని బమ్మిని చేసినందుకుగానూ ఆయాచితంగా లభించిందనే ప్రచారం ఉంది. సదరు వ్యక్తి ఓ సీనియర్ టీడీపీ ఎమ్మెల్యేకు బినామీగా వ్యవహరిస్తారనే ప్రచారం కూడా ఉంది. అతడి వద్ద మరో రూ.1,000 కోట్ల విలువ చేసే ఫైల్స్ సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. సీనియర్ ఎమ్మెల్యే ద్వారా కీలక మంత్రికి.. తద్వారా చినబాబుకు దగ్గరగా ఉండి వ్యవహారాలు నడిపిస్తున్నట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సిట్‌లోని భూములకు కూడా చక్రాలు వచ్చి ప్రైవేటువ్యక్తుల పరమవుతుండటం గమనార్హం

చంద్రబాబును గద్దె దించడమే దళితుల లక్ష్యం

- దళితుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా సీఎం, మంత్రుల వ్యాఖ్యలు
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా ముఖ్యమంత్రి అయ్యేది జగనే..
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు, చిత్రంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కనకారావు, విశాఖ, అనకాపల్లి అధ్యక్షులు కేకే రాజు, అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు

విశాఖ సిటీ: దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు నిద్రపోయేది లేదని.. అదే దళితుల లక్ష్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తేల్చి చెప్పారు. మద్దిలపాలెంలోని జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా? అని చంద్రబాబు, మీకెందుకురా రాజకీయాలు, మేము చేసుకుంటాం.. అని ఆ పార్టీ విప్ చింతమనేని ప్రభాకర్, మంత్రులు సైతం దళితుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల పుట్టుకను, చదువును అవమానించిన టీడీపీని వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం చేయడం తథ్యమన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పక్కనపెట్టి.. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం జగన్ రూ.2.75 లక్షల కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. దళితుల ఆత్మాభిమానం పెరగాలంటే జగన్ సీఎం కావాలని తేల్చి చెప్పారు. జైభీమ్-జై జగన్ నినాదం రాష్ట్రంలో మార్మోగిపోవాలని పిలుపునిచ్చారు. పులివెందులలో జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికలు వైఎస్సార్ సీపీకి, పోలీసులకు మధ్య జరిగాయన్నారు.

- ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే దళితులకు రాజ్యాధికారం దక్కిందని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎంలు, మంత్రులతో పాటు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు, వారి ఆస్తుల ఆక్రమణలు, గ్రామ బహిష్కరణలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాత్రం రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం జగన్ కృషి చేశారన్నారు. గత ఎన్నికల్లో దళితులు వైఎస్సార్ సీపీకి అధికంగా ఓటేశారని గుర్తు చేశారు.
- ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ అణచివేతకు గురవుతున్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జగన్ అండగా నిలిచారని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీ పడేవిధంగా ఇంగ్లిష్ మీడియంతోపాటు సీబీఎస్‌సీ సిలబస్‌ను ప్రవేశపెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని విమర్శించారు.
- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ దళితులపై కక్షపూరితంగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. మోసానికి ప్యాంటు, షర్టు వేస్తే చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. దళితుల ఆత్మగౌరవ చిహ్నంగా విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తే.. చంద్రబాబు తన టీడీపీ గూండాలతో రాళ్లు వేయించారని ఆరోపించారు.
- పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు చిత్తశుద్ధి, సమానత్వ దృక్పథంతో దళిత వర్గాన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఉన్నత స్థానంలో కూర్చోబెట్టిన నాయకుడు జగన్ అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించి దళితులపై వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు ఇంకా వెయ్యి రోజులు మాత్రమే అధికారంలో ఉంటారని, ఆ తర్వాత జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవడం ఖాయమన్నారు.
- దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ జగన్ ఒక సింహం అని, సింహానికి పదవి, కిరీటం అవసరం లేదన్నారు. కార్యకర్తలకు చిన్న దెబ్బ తగిలినా 100 రెట్లు అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం జైళ్లను బాగు చేసుకోవాలని, ఏసీలు పెట్టుకోవాలని సూచించారు.
- తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు రాజ్యాధికారం ఇచ్చింది జగన్ మాత్రమే అన్నారు. డిప్యూటీ సీఎం నుంచి కార్పొరేటర్ల వరకు అన్నింట్లోనూ దళితులకు భాగస్వామ్యం కల్పించారని తెలిపారు.
- గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులకు సంక్షేమం అందకపోగా వారిపై దాడులు జరుగుతుండడం దారుణమన్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

సమావేశంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, సిహెచ్ వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, పార్టీ కార్యాలయం ఇన్‌చార్జ్ రవిరెడ్డి, రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ, పేర్ల విజయ్‌చంద్ర, పార్టీ నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, రవిరాజు, జహీర్ అహ్మద్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, జిల్లా పరిశీలకుడు వీరంశెట్టి పూర్ణ చంద్రరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ, జోనల్ విభాగం అధ్యక్షుడు అల్లంపల్లి రాజాబాబు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు చెన్నా జానకిరామ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్పాకృష్ణ, కార్పొరేటర్లు కె.వి.శశికళ, బళ్ల లక్ష్మణ్, జిల్లా అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి భాగ్యవతి, ఐ.డి.బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కోన వెంకట శంకర సన్యాసిరావు, ఎడ్ల సిద్ధార్థ రాజు, ముంజేటి హనుమంతరావు నియోజకవర్గం అధ్యక్షులు మర్దపూడి పరదేశి, పూడి మల్లేశ్వరరావు, ఆకుల శ్యామ్‌కుమార్, దొండపర్తి లక్ష్మారావు, బంగారు భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

బీచ్‌రోడ్డు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం జరగనున్న వేడుకల ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆయన తుది సమీక్ష చేపట్టారు. ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకుని.. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. శకటాలు, స్టాళ్లు, సీటింగ్ ఏర్పాట్లలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. వర్షం వచ్చినా కార్యక్రమానికి అంతరాయం కలగకుండా వాటర్‌ప్రూఫ్ టెంట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. వేడుకలకు వచ్చే అతిథులకు, సాధారణ పౌరులకు సీటింగ్, తాగునీటి ఏర్పాట్లు చేయాలని జేసీ ఆదేశించారు. పైలట్ వాహనాన్ని ముందుగానే తనిఖీ చేసి, ట్రయల్ రన్ వేసి సిద్ధంగా ఉంచాలన్నారు. స్టేజీ డెకరేషన్, శానిటేషన్, సర్టిఫికెట్ల తయారీ, జ్ఞాపికల రూపకల్పన వంటి పనులను పూర్తి చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని, పాటల నిడివి తగ్గించాలని జేసీ సూచించారు. సమావేశంలో డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. కాగా.. రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ మేరకు రాష్ట్ర పరిపాలన విభాగం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.

క్రీడాకారుడు చరణ్‌కు గవర్నర్ బంగ్లా నుంచి ఆహ్వానం



కూర్మన్నపాలెం: వాలీబాల్ క్రీడాకారుడు అట్టాడ చరణ్‌కు గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. వడ్లపూడిలోని కణితి కాలనీలో నివాసముంటున్న చరణ్‌కు శ్రీకాకుళం కలెక్టర్ ద్వారా రాజ్‌భవన్ నుంచి గవర్నర్ కార్యదర్శి లేఖ పంపించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న గవర్నర్ బంగ్లాలో జరిగే విందుకు హాజరు కావాలని ఆ లేఖలో పేర్కొన్నారు. చరణ్ తన మేనమామల వద్ద ఉంటూ.. విశాఖపట్నంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో చరణ్ కాంస్య పతకం సాధించాడు. గవర్నర్ బంగ్లా నుంచి ఆహ్వానం రావడంతో చరణ్‌ను పలువురు అభినందించారు.



హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఏయూ పరిపాలన భవనం వద్ద నుంచి 400 అడుగుల జాతీయ పతాకంతో ఉద్యోగులు, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో దేశభక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏయూ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యువతను భాగస్వామ్యం చేస్తూ వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం ఈ ర్యాలీ సిరిపురం కూడలి, ఏయూ ఇన్ గేట్ మీదుగా మళ్లీ పరిపాలన భవనం వద్ద చేరుకోవడంతో ముగిసింది. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, డీన్ కె.రమా సుధ, ఎస్.హరినాథ్, ఎస్.ఎం.యుగంధర్, డి.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ సెంటర్లలో తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

సీతంపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తన బృందంతో కలిసి జిల్లాలోని అక్షయ ఐవీఎఫ్, నికిత హాస్పిటల్, రోషిణి ఫెర్టిలిటీ కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో అన్ని పత్రాలను, రిజిస్ట్రేషన్ రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంతమందికి సంతానోత్పత్తి చికిత్స చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేదవారికి రుసుము తగ్గించి సేవలందించాలని ఆయా కేంద్రాల నిర్వాహకులకు, గైనకాలజిస్టులకు సూచించారు. ఎప్పటికప్పుడు నిజాయితీగా సమాచారాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయానికి అందజేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ధరల పట్టిక ప్రదర్శించాలని సూచించారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫారం ఎఫ్ లను తనిఖీచేసి ఐఈసీ బోర్డులను నిర్దేశించిన ప్రదేశంలో ఉంచాలని, సమయానికి రెన్యువల్ చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట డాక్టర్ బి.ఉమావతి, డీపీఎంవో బి.నాగేశ్వరరావు ఉన్నారు.

జోడు గుర్రాలపై జీవనయానం



కథల్లోని రాజకుమారుడిలా కాకపోయినా.. కడుపు నింపుకునేందుకు రెండు గుర్రాలను ఒకేసారి అదుపు చేస్తూ బీచ్ రోడ్డులో వెళ్తున్నాడు ఈ యువకుడు. జాలరి పేట నుంచి బీచ్‌రోడ్డు వైపునకు ఒకే సారి రెండు గుర్రాలను సమన్వయం చేసుకుంటూ తీసుకెళ్తున్న అతని నైపుణ్యం చూసే వారిని ఆకట్టుకుంది. ఉపాధి కోసం చేసే ఈ ప్రయాణం అతని దినచర్యలో ఒక భాగం.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్

భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం

పుస్తకాల నిషేధంపై సాహితీవేత్తల ఆగ్రహం

దాబాగార్డెన్స్: జమ్మూ కశ్మీర్ చరిత్రకు సంబంధించిన 25 పుస్తకాలను ప్రభుత్వం నిషేధించడాన్ని సాహితీవేత్తలు వ్యతిరేకించారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడిగా దీనిని అభివర్ణించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం అరసం ప్రధాన కార్యదర్శి అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్. శర్మ మాట్లాడుతూ ఈ విధంగా పుస్తకాలు నిషేధించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇలాంటి సమయంలో మేధావులు గొంతెత్తాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ మాజీ సభ్యుడు ఆచార్య కె.ఎస్. చలం మాట్లాడుతూ గురజాడ ఇంటిపై దాడి జరిగిందని, దీనిని కూడా ఖండించాల్సిన బాధ్యతను గుర్తుచేశారు. నాగార్జున యూనివర్శిటీ మాజీ ఉప కులపతి బాల మోహన్ దాస్ మాట్లాడుతూ రచయితలను ప్రోత్సహించడం ప్రభుత్వాల బాధ్యత అని, స్వేచ్ఛను హరించే చర్యలను ఖండించాలన్నారు. సమతా సాహితీ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, సాహితీవేత్త మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు పి.ఫ్రాన్సిస్, అమరావతి విశ్వ సాహితీ ప్రధాన కార్యదర్శి సిహెచ్ చిన సూర్యనారాయణ, క్షేత్రపాల్ రెడ్డి, తెలుగు దండు ఫణిశయన సూరి, కార్మిక నాయకుడు సత్యనారాయణ, డాక్టర కేపీఎస్ మూర్తి, పరమేశ్వరావు మాట్లాడారు.

రాయలసీమ రాయల్స్ విజయం

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భాగంగా బుధవారం వైఎస్సార్ స్టేడియంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ రాయల్స్ 51 పరుగుల తేడాతో తుంగభద్ర వారియర్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాయల్స్ 6 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. కెప్టెన్ రషీద్ 67, సాత్విక్ 45, హర్షవర్ధన్ 34 పరుగులతో రాణించారు. తోషిత్ రెండు వికెట్లు తీశాడు. 192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన తుంగభద్ర వారియర్స్ జట్టు 36 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ మహీప్‌కుమార్ (34), దత్త (37) పోరాడినా.. వీరిద్దరూ 105 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరారు. రోహిత్ (26 నాటౌట్) మాత్రమే కాస్త మెరుగ్గా ఆడాడు. శశికాంత్, సౌరభ్ డకౌట్లయ్యారు. చివరికి తుంగభద్ర వారియర్స్ జట్టు 17.2 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌట్ అయింది. గిరినాథ్, సాకేత్ చెరో మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

విజయవాడ– భీమవరం మ్యాచ్ రద్దు

భీమవరం బుల్స్, విజయవాడ సన్‌షైనర్స్ మధ్య జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ సన్‌షైనర్స్ 19 ఓవర్లలో ఏడు వికెట్లకు 204 పరుగులు చేయగా.. వర్షంతో మ్యాచ్‌కు అంతరాయం వచ్చింది. ఆ తర్వాత వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు.

నవోదయలో ప్రవేశాల దరఖాస్తు గడువు పెంపు

కొమ్మాది: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఈ నెల 27 వరకు పొడిగించారు. విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు నవోదయ ప్రిన్సిపాల్ వై.ఎస్.ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

అంతస్తుకో రేటు

అనుమతులు గోరంత.. అక్రమాలు అందనంత

- ప్లాన్ ఒకలా.. నిర్మాణం మరోలా..
- ఉల్లంఘనలను పట్టించుకోని అధికారులు
- భవనం పూర్తి కాకుండానే ఆక్యుపెన్సీ జారీ
- టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై విస్మయం

గాజువాక : నిబంధనలన్నీ పాటించి చిన్న భవనం నిర్మించుకుంటేనే భూతద్దంలో చూసి విరుచుకుపడిపోయే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి షీలానగర్ దరి వెంకటేశ్వర కాలనీ 4ఎ లైన్‌లో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనంపై అవ్యాజప్రేమ చూపించారు. నిబంధనలకు పాతరేసినా, భవన నిర్మాణంలో పాటించాల్సిన నియమాలను ఉల్లంఘించినా, జీవీఎంసీ నుంచి పొందిన అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినా చూసీ చూడనట్టు వదిలేశారు. అంతేకాదు అసంపూర్తిగా ఉన్న భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను కూడా జారీ చేసేశారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో సామాజిక కార్యకర్తలు టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గాజువాక మండలం తుంగ్లాం సర్వే నంబర్ 102/2డి1ఎ 700 గజాల విస్తీర్ణంలో రెండు స్థలాలున్నాయి. అందులో ఒకటి 300 చదరపు గజాలు కాగా, మరొకటి 400 చదరపు గజాల స్థలం. ఈ రెండు స్థలాల్లో భవన నిర్మాణం కోసం సదరు బిల్డర్ రెండు వేర్వేరుగా అనుమతులు పొందాడు. 20 అడుగుల రహదారిని ఆనుకొని చేపట్టిన భవన నిర్మాణం ప్లాన్ ప్రకారమైతే ఒక స్థలంలో స్టిల్ట్+గ్రౌండ్+రెండు అంతస్తులు, మరో స్థలంలో స్టిల్ట్+గ్రౌండ్+మూడు అంతస్తులు నిర్మించుకోవాలి. సెట్‌బ్యాక్‌లను పూర్తిస్థాయిలో మినహాయించాల్సి ఉంది. అయితే, సెట్‌బ్యాక్‌లకు ఉంచాల్సిన స్థలంలో ఇంచి కూడా వదలకుండా నిర్మాణం జరిగిపోతోంది.

రుణాలకు బ్యాంకులు ససేమిరా!

ఈ భవనంలో ఫ్లాట్లు కొనుగోలు చేయాలనుకొనేవారికి రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు అంగీకరించలేదని తెలుస్తోంది. ఇది ప్రణాళిక నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదని, ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారన్న కోణంలో బ్యాంకులు విముఖత చూపుతున్నట్టు తెలుస్తోంది. రెరా, జీవీఎంసీ బిల్డింగ్ బైలా, ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం



నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం

బిల్డర్‌తోపాటు సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దాటవేత ధోరణిలో అధికారులు

ఈ విషయంపై గాజువాక జోన్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరావును సంప్రదించడానికి 'సాక్షి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఫోన్‌లో మాట్లాడటానికి ఇష్టపడలేదు. టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్ వరప్రసాద్‌ను సంప్రదించగా ఆయన భిన్న విషయాలు చెప్పారు. సదరు భవన నిర్మాణం పూర్తయిందని ఒకసారి, నిబంధనల ప్రకారమే ఆక్యుపెన్సీ ఇచ్చామని మరోసారి, అక్కడ ఉల్లంఘనలు లేవని ఇంకోసారి చెప్పుకొచ్చారు. భవనం ఫొటోలు చూపించగా పరిశీలిస్తామని పేర్కొన్నారు.



నిర్మాణం పూర్తికాకుండా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసిన భవనం ఇదే..

నిబంధనలు తెలియవా?

బిల్డర్ ప్రాజెక్టు కోసం ఎటువంటి రెరా రిజిస్ట్రేషన్ లేకుండా 1020 చదరపు అడుగులు, 980 చదరపు అడుగులు, 1345 చదరపు అడుగులు, 1467 చదరపు అడుగుల చొప్పున ఫ్లాట్‌లను విక్రయానికి పెట్టాడు. ఇది రియల్ ఎస్టేట్ నియంత్రణ, అభివృద్ధి చట్టం (రెరా)ను ఉల్లంఘించడమేనని నిపుణులు పేర్కొంటున్నారు. అలా విక్రయించడం గృహ కొనుగోలుదారులను మోసం చేయడమేనని చెబుతున్నారు. భవన నిర్మాణం ఒకపక్క సాగుతోంది. మరోపక్క టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్యుపెన్సీ జారీ చేసేశారు. నిర్మాణం పూర్తయిన తరువాత అన్నీ సరిగ్గా ఉన్నప్పటికీ అనేక రకాలుగా అధికారులను సంతృప్తి చేస్తే తప్ప రాని ఆక్యుపెన్సీ అన్నీ ఉల్లంఘనలు.. నిర్మాణం కూడా పూర్తి కాని భవనానికి ఎలా ఇచ్చారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలుతోంది.

నచ్చినట్లు నిర్మాణం

ఈ రెండు భవనాలకు బిల్డర్ వ్యక్తిగత అనుమతులు తీసుకున్నాడు. ప్లాన్ ప్రకారం వ్యక్తిగత నివాస భవనాలు కాకుండా వాటిని బహుళ యూనిట్లుగా మార్చాడు. తొమ్మిది మీటర్ల కంటే తక్కువ రహదారి ఉన్న స్థలాల్లో నిర్మించే భవనాలకు వ్యక్తిగత నివాస భవనంగా మాత్రమే ప్లాన్ పొందే అవకాశం ఉంది. దీంతో వ్యక్తిగత నివాస భవనాలకు ప్లాన్ పొందిన బిల్డర్ రెండు భవనాలను చట్ట విరుద్ధంగా ఒకే బ్లాక్‌లో విలీనం చేశాడు. ప్లాన్‌కు విరుద్ధంగా స్టిల్ట్+గ్రౌండ్+మూడు అంతస్తుల నిర్మాణం చేపట్టాడు. అదనపు అంతస్తును, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలను సమర్థించుకోవడానికి ఎటువంటి టీడీఆర్‌లు పొందలేదు. ఇంతవరకు బిల్డర్ కక్కుర్తి పడి ఉండొచ్చు అనుకున్నా భవన నిర్మాణం ఇంకా పూర్తి కాకుండానే టౌన్‌ప్లానింగ్ అధికారులు దానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (15.07.2025న బీపే నంబర్ 1086/1682/బి/జెడ్/వైటీఏ/2024) లు ఇచ్చేశారు. భవన నిర్మాణం పూర్తి కాకుండా, ఎలాంటి సౌకర్యాలు కల్పించకముందే ఉల్లంఘనల భవనాలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఎలా ఇచ్చారన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

మాదకద్రవ్య రహిత విశాఖే లక్ష్యం

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు

బీచ్‌రోడ్డు: విశాఖను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని, ఈ మహా యజ్ఞంలో అందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది చేత కలెక్టర్ నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ దేశానికైనా యువతే ప్రధాన శక్తి అన్నారు. దేశాభివృద్ధిలో వారి పాత్ర ముఖ్యమైనదని, మాదక ద్రవ్య రహిత భారతదేశ ప్రచారంలో యువత పెద్ద సంఖ్యలో చేరాలి అనే సారాంశాన్ని చదివి వినిపించారు. అందరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందామని ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

చేయించారు. డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కె.కవిత, ఈగల్ విభాగం సీఐ కల్యాణి, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ ప్రతినిధి ఉమారాణి, ఎన్‌సీబీ అధికారులు, సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైజాగ్ పోర్టులో ప్రతిజ్ఞ

సాక్షి, విశాఖపట్నం: మాదకద్రవ్య రహిత భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)లో బుధవారం నిర్వహించారు. సాంబమూర్తి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో మాదకద్రవ్య రహిత సమాజం నిర్మాణానికి కట్టుబడి ఉంటామని పోర్టు అధిపతులు, అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పోర్టు చైర్మన్ డా. ఎం అంగముత్తు మాట్లాడుతూ సీఈఎంఎస్, ఐఎంయూ విద్యా సంస్థల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు.

రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్


దాబాగార్డెన్స్: రెవెన్యూ వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం అధికారులతో సమావేశమయ్యారు. ఆస్తి పన్ను బకాయిలు ఈ నెల 31 నాటికి శత శాతం వసూలు చేయాలని, ఆగస్టు 31 నాటికి 2025–26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నులు 60 శాతం వసూలు చేయాలని స్పష్టం చేశారు. వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు ఇంటింటా సర్వే నిర్వహించి.. పన్నులు విధించాల్సిన ఆస్తులను గుర్తించాలని సూచించారు. ఆస్తుల గుర్తింపు విధుల్లో నిర్లక్ష్యం చూపిన రెవెన్యూ అధికారులు బి.అప్పలరాజు, కేఎస్ పడాల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీసీఆర్‌ను ఆదేశించారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంస్థలు చెల్లించాల్సిన పన్నులు రెండు వారాల్లో వసూలు చేయాలని జోనల్ కమిషనర్లను, డీపీవో మనీషా త్రిపాఠిని ఆదేశించారు. జీవీఎంసీ దుకాణాలు, వాణిజ్య సముదాయాల అద్దెలు, ఆశీలు, మార్కెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని నిర్ణీత సమయంలో వసూళ్లు చేయాలన్నారు. ప్రతి వార్డులో ఒక సామాజిక భవనం ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రస్తుతం ఉన్న సామాజిక భవనాల్లో మౌలిక సదుపాయాలు లేకుంటే మరమ్మతులకు చర్యలు చేపట్టాలన్నారు. టిడ్కో గృహాల్లో నివాసం లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని, వారికి కేటాయించిన గృహాలను రద్దు చేసేందుకు నివేదిక సిద్ధం జెడ్సీలను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, డీసీ(రెవెన్యూ) శ్రీనివాసరావు, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి, జోన్ల కమిషనర్లతో పాటు వీడియో కాన్ఫరెన్స్‌లో వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారి పట్టాల రద్దు

బీచ్‌రోడ్డు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ పేదలందరికీ ఇళ్లు పథకంలో నిర్మాణం పూర్తయిన ఇళ్లను ప్రాథమికంగా లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్ డా.ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత లక్ష్యాల ప్రకారం రోజువారీ స్టేజ్ అప్‌డేషన్ జరగాలని, నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని కోరారు. స్టేజ్ అప్‌డేషన్‌లో భాగంగా ప్రత్యేక వాహనాల ద్వారా లబ్ధిదారులను లేఅవుట్ వద్దకు తీసుకెళ్లి జియో ట్యాగింగ్ చేయించాలన్నారు. ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభించని లేదా ఆసక్తి చూపని లబ్ధిదారుల విషయంలో గ్రామసభ నిర్వహించి, వారి నుంచి సమ్మతి తీసుకుని తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనల ప్రకారం అటువంటి వారి పట్టాలను రద్దు చేసి, అర్హులైన ఇతర లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో భీమిలి, విశాఖ ఆర్డీవోలు సంగీత్ మాధుర్, పి.శ్రీలేఖ, గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, లేఅవుట్ ఇన్‌చార్జిలు, వర్చువల్‌గా గృహ నిర్మాణ శాఖ ఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌లో స్నేహం.. పెట్టుబడి మోసం

రిటైర్డ్ ప్రొఫెసర్‌కు కుచ్చుటోపీ పెట్టిన మోసగాడు అరెస్ట్



సతీష్‌కుమార్(ఫైల్)

అల్లిపురం: ఫేస్‌బుక్‌లో పరిచయం పెంచుకుని పెట్టుబడి పేరుతో రిటైర్డ్ ప్రొఫెసర్ నుంచి రూ.49.72 లక్షలు దోచుకున్న రిలేషన్‌షిప్ మేనేజర్ సతీష్ కుమార్‌ను నగర సైబర్ క్రైం పోలీసులు ఢిల్లీలో అరెస్ట్ చేశారు. డిజిటల్ మోసాలపై సైబర్ క్రైం పోలీసులు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ అరెస్ట్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీపీకాలనీ, సెక్టార్-6కి చెందిన 75 ఏళ్ల రిటైర్డ్ ప్రొఫెసర్‌తో నిందితుడు సతీష్ కుమార్ ఫేస్‌బుక్‌లో స్నేహం చేసి పెట్టుబడి పెట్టాలంటూ ఆశ చూపాడు. తద్వారా అతని నుంచి దశలవారీగా రూ.49.72 లక్షలు కాజేశాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని సెక్టార్-16కి చెందిన సతీష్ కుమార్‌గా గుర్తించారు. నిందితుడు నోయిడా వరల్డ్ ట్రేడ్ టవర్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా పని చేస్తున్నట్లు పోలీసులు కనుగొన్నారు. విచారణలో భాగంగా సతీష్ కుమార్ తన ఐడీఎఫ్‌సీ బ్యాంక్ కరెంట్ అకౌంట్‌ను సైబర్ నేరగాళ్లకు ఇచ్చి భారీ మోసాలకు సహకరించినట్లు తేలింది. ఈ అకౌంట్ ద్వారా వారు మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిపై 111(2), 319(2), 318(4) రెడ్/విత్ 61(2) బీఎన్ఎస్, 66-సీ, 66-డీ ఐటీఏ-2000-2008 సెక్షన్ల కింద కేసు(నం. 112/2025) నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ముందుకి.. వెనక్కి..!



సాగర్‌నగర్ బీచ్ వద్ద ముందుకొచ్చిన అలలు



భీమిలి లైట్‌హౌస్ ఎదురుగా వెనక్కి వెళ్లిన సముద్రం

కొమ్మాది/భీమునిపట్నం: విశాఖ తీరంలో సముద్రం వింతగా ప్రవర్తిస్తోంది. ఒకే తీర ప్రాంతంలోని రెండు సమీప ప్రదేశాల్లో భిన్నమైన పరిస్థితులు నెలకొనడం స్థానికులను, పర్యాటకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాగర్‌నగర్ వద్ద సముద్రం ఉవ్వెత్తున ఎగసిపడుతూ ముందుకు చొచ్చుకువస్తుండగా.. భీమిలిలో వందల అడుగులు వెనక్కి వెళ్లిపోవడం ఆసక్తికరంగా మారింది. సాగర్‌నగర్ తీరంలో గత మూడు రోజులుగా సముద్రం అల్లకల్లోలంగా ఉంది. అలలు పెద్ద ఎత్తున ఎగసిపడుతూ ఇసుక తిన్నెల వైపు దూసుకొస్తున్నాయి. బుధవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగడంతో తీరానికి వచ్చిన పర్యాటకులు భయాందోళనలకు గురయ్యారు. దీనికి పూర్తి విరుద్ధంగా భీమునిపట్నం తీరంలో సముద్రం శాంతించి వెనక్కి తగ్గింది. సాధారణంగా ఆటుపోట్ల సమయంలో 20 నుంచి 30 అడుగులు వెనక్కి వెళ్లే సముద్రం, ఇప్పుడు ఏకంగా వంద అడుగులకు పైగా వెనక్కి వెళ్లింది. దీంతో భీమిలి తీరం విశాలంగా మారింది. సుమారు 30 ఏళ్ల కిందట ఉన్నంత విశాలమైన తీరం మళ్లీ కనిపించడంతో పర్యాటకులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో సందర్శకుల సంఖ్య పెరిగి తీరం సందడిగా మారుతోంది.

7 నుంచి రెగ్యులర్ మార్గంలో జన్మభూమి, ఎల్టీటీ

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా దారి మళ్లించిన జన్మభూమి, ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లు సెప్టెంబరు 7 నుంచి రెగ్యులర్ మార్గంలో నడుస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖ-లింగంపల్లి-విశాఖ (12805/ 12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 7 నుంచి చర్లపల్లి, సికింద్రాబాద్, బేగంపేట స్టేషన్‌ల మీదుగా నడుస్తుంది. విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్–విశాఖపట్నం(18519/18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 7వ తేదీ నుంచి రెగ్యులర్ మార్గంలో కాజీపేట, చర్లపల్లి, సికింద్రాబాద్ స్టేషన్ల మీదుగా నడుస్తుంది. ● విశాఖ–మహబూబ్‌నగర్–విశాఖ (12861/22) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 22వ తేదీ నుంచి కోచ్‌లు మారనున్నాయి.